## క్లుప్తంగా

### ‘ఆలూరు’కు శుభాకాంక్షల వెల్లువ



సాంబశివారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల/యల్లనూరు: వైఎస్సార్‌సీపీ స్టేట్ అడ్మిన్‌గా నియమితులై శనివారం అనంతపురానికి వచ్చిన ఆలూరు సాంబశివారెడ్డిని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శింగనమల మండలానికి చెందిన మాజీ డీసీఎంఎస్ మెంబరు బొమ్మన శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్వీ నారాయణ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య, నాయకులు కలసి ఆయనను అభినందించారు. అలాగే యల్లనూరుకు చెందిన జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి పద్మావతమ్మ, ప్రచార కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి తదితరులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చింతకాయమంద నాగరంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రథ నిర్మాణానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని అమ్మవారిపేటలో శ్రీరాముల వారి రథ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టేట్ అడ్మిన్ హెడ్, ఎన్నారై వింగ్ కోఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజక వర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తన భార్య జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో దేవాలయాల నిర్మాణానికి ఎంతో కృషి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు రమణారెడ్డి, అమ్మవారిపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

### కారు బోల్తా

పుట్లూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద శనివారం కారు బోల్తా పడింది. తాడిపత్రి నుంచి పుట్లూరుకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి కారులో వస్తుండగా అదుపుతప్పింది. ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీనివాసులుకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని సీఐ సత్యబాబు పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు.

### సన్మానం



భాస్కర్‌నాయుడును సత్కరిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన గుత్తా భాస్కర్ నాయుడు హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(హెచ్‌ఆర్‌ఏజే) ఏపీ కన్వీనర్‌గా ఎంపిక కావడంతో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అతడిని అసోసియేషన్ సభ్యులు శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఏజే జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు, స్టేట్ అధ్యక్షుడు శివకుమార్, మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి పాల్గొన్నారు.

### ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలి




ప్రసంగిస్తున్న మోటివేషనల్ స్పీకర్ నాగ ప్రసాద్

గుత్తి: విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని మోటివేషనల్ స్పీకర్ నాగ ప్రసాద్ అన్నారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం బీటెక్ విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సవాళ్లను ఎదురించాలని, జీవితంలో గొప్ప విజయాలు సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అన్ని కులాల వారికీ సేవలు

గుత్తి: వడ్డెర్ల కులస్తులతో పాటు అన్ని కులాల వారికి సేవలు అందిస్తామని ఓసీసీఐ( ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవి, రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడు తూ తమకు బాధ్యతలు అప్పగించిన ఓసీసీఐ ఫౌండర్ శంకర్‌లాల్, నేషనల్ జాయింట్ సెక్రటరీ లీలాభాను ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అంతకుముందు స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య వంశ ఒడి యరాజులు సంఘం అధ్యక్షుడు పీట్ల చిరంజీవి, గౌరవాధ్యక్షుడు మనుమంతు, సర్పంచు చంద్ర, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి దసరా ఉత్సవాలు

- ముస్తాబవుతున్న దేవాలయాలు
- రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం




తాడిపత్రిలో ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం



గుంతకల్లులో ఏర్పాటు చేసిన భారీ స్వాగత తోరణం

తాడిపత్రి రూరల్: పట్టణంలో ఈ నెల 22 నుంచి నిర్వహించే దసర ఉత్సవాల కోసం పలు దేవాలయాలు ముస్తాబు అవుతున్నాయి. పట్టణంలోని మత్యకన్యకాపరమేశ్వరీదేవి, పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి, చౌడేశ్వరీ, విజయచౌడేశ్వరీ దేవాలయం, లలితాదేవి, పెద్దమ్మ, యల్లమ్మ, కాళికాదేవి , గంగమ్మ, కనకదుర్గ, కర్నెమ్మ, కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. నవరాత్రుల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన మత్యకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లు కోసం పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 22న రాజరాజేశ్వరీదేవి అలంకరణతో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 23వ తేదీ అమ్మవారు గాయత్రీ అలంకరణ, 24న శ్రీశైల భ్రమరాంభికదేవి, 25న గజలక్ష్మి, 26న అన్నపూర్ణదేవి , 27న సూర్యకళాదేవి, 28న అష్టలక్ష్మిదేవి, 29న సరస్వతీదేవి,, 30న మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 1న కన్యాకుమారిదేవి అలంకరణ, అమ్మవారి గుండ ప్రవేశం, 2న విజయదశమి రోజు పట్టణంలోని గాంధీసర్కిల్‌లో అమ్మవారి విశ్వరూప దర్శనం ప్రత్యేక కార్యక్రమం, సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం ఏర్పాటుచేశారు.3న అమ్మవారి డోలికోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. రోజూ సాయంత్రం 6.30 నుంచి 8.00 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న గోపూజ కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

గుంతకల్లు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న దసరా శరన్నరాత్రోత్సవములను విజయవంతం చేయాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాజగదీష్, కందూరి కృపాకర్ కోరారు. శనివారం ఆలయంలోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 3వ తేదీ వరకూ దాదపు 11 రోజుల పాటు దసరా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ నెల 22న కంచి కామాక్షిదేవిగా, 23న మహాగౌరి, 24న అన్నపూర్ణదేవి, 25న రాజరాజేశ్వరీదేవి, 26న కొల్హాపూర్ మహాలక్ష్మిగా, 27న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిగా, 28న స్కంధమాత, 29న సరస్వతీదేవిగా, 30న మహిషాసుర మర్ధనిగా, అక్టోబర్ 1న రాజ శ్యామల దేవిగా కటాక్షించనున్నారని వివరించారు. ఇక 2వ తేదీ దసరా పండగ సందర్భంగా ఉదయం శమీ దర్శనం, సాయంత్రం వడి బాలోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3వ తేదీ చివరి రోజు తెప్పోత్సవంతో దసరా ఉత్సవాలు ముగుస్తాయన్నారు. అనంతరం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల సవనీరును విడుదల చేశారు. కార్యక్రమంలో కోశధికారి మేడం వెంకటేశ్వర్లు, నాయకులు చెల్లూరు నరసింహులు, జయంతి సూర్యనారాయణ, గుంతా రమేష్‌బాబు, ఇననూరు వెంకటసుబ్బయ్య, రాజావెంకటరమణ, నామా జీవన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### సేవాఘడ్‌లో ఉత్సవాలు ఇలా..

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో ఉన్న మాత జగదాంబ ఆలయంలో ఈ నెల 22 నుంచి దసరా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవ నాయక్, అర్చకుడు మారుతి ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 22న బాల త్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణ దేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలిత త్రిపుర సుందరీదేవి, 28న మహాదండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న, దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషా సురమర్దినిదేవి, 2న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో మాత జగదాంబ దర్శమిస్తారన్నారు. రోజూ ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు పాల్గొని నవరాత్రులు విజయవంతం చేయాలని వారు కోరారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



గుత్తిలో మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, న్యాయవాదులు



యాడికిలో ఉన్నత పాఠశాల వద్ద మొక్క నాటుతున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

గుత్తి/శింగనమల/గుంతకల్లు టౌన్/గుత్తిరూరల్/పామిడి/యాడికి/తాడిపత్రి రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి సూచించారు. గుత్తిలోని కోర్టుల ఆవరణలో శనివారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జిలు మంజుల, అనిల్ కుమార్ నాయక్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అలాగే నార్పల మండలంలోని గొల్లపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జనార్దన్ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ శంకర్ యాదవ్, కార్యదర్శి కుళ్లాయప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ నయీమ్, కౌన్సిలర్లు, అధికారులు చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అదేవిధంగా గుత్తి మండలంలోని రజాపురం, పామిడి మండలంలో, యాడికిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తాడిప త్రి అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కాటమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయండి



రేకులకుంటలో పొలాలను సందర్శిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు అధ్యక్షతన జిల్లాలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన పరిశోధనా స్థానాలు రేకులకుంట, రెడ్డిపల్లి కేవీకే, కళ్యాణదుర్గం కేవీకే, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వ్యవసాయ శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు నిరంతరం సూచనలు, సలహాలు అందించాలన్నారు. అనంతరం రేకులకుంటలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవానంద్ కుమార్, ఆత్మ పీడీ పద్మలత, కీటక శాస్త్రవేత్త జాహ్నవి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఏడీలు, అధికారులు పాల్గొన్నారు.

## ‘కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలి’

గుంతకల్లు రూరల్: కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని కోరుతూ పట్టణంలోని నాయీబ్రాహ్మణులు శనివారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. నాయీబ్రాహ్మణులు పట్టణంలోని ప్రజా సంఘాల నాయకులతో కలిసి కార్పొరేట్ సెలూన్ షాపులకు వ్యతిరేఖంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు సేకరించిన దాదాపు 3 వేల ప్రతులను ఆర్డీఓకు అందజేస్తూ తమ సమస్యలను విన్నవించారు. క్షౌ ర వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యదర్శి సూరి, జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వామిదాసు, క్షౌ ర వృత్తిదారుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### పంట కోత ప్రయోగాలపై అవగాహన

శింగనమల(నార్పల): పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి శనివారం ఏఎస్ఓ కృష్ణయ్య అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగాలకు సర్వే నంబర్లు ర్యాడమ్‌గా ఇవ్వడం జరుగుతుందని, వాటిని ముందుగా సిబ్బంది గుర్తించి రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చెన్నవీరస్వామి, ఏఈఓ ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### నార్పల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శేషారెడ్డి



శింగనమల(నార్పల): నార్పల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న శేషారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో, ఆ స్థానంలో ఏఓను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. బాధ్యతలు తీసుకున్న ఆయనకు అధికారులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులకు అభినందనలు

గుంతకల్లు రూరల్: మొలకలపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.షర్మిల, పి. గణేష్ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం ఓబులరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణల ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

### ధ్యానంతో ఆత్మవిశ్వాసం పెంచుకోవచ్చు

పెద్దవడుగూరు: ధ్యానం చేయడం వలన ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చని బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు రూపా మల్లికార్జున సూచించారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు ధ్యానంపై అవగాహన కల్పించారు.

### పచ్చ నేత ఇంట్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



వెంగమనాయుడు కాలనీలోని ఓ టీడీపీ నేత ఇంట్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ దృశ్యం

పామిడి: రెవెన్యూ అధికారులు ఇంటింటికి వెళ్లి రేషన్‌కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా, పామిడిలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఓ పచ్చనేత ఇంట్లో కూర్చొని కార్డుల పంపిణీ చేపట్టడంపై పామిడిలో ప్రజల నుంచి అసంతృప్తి సెగలు మిన్నంటాయి. స్థానిక మూడోవార్డులోని వెంగమనాయుడు కాలనీలో రెవెన్యూ అధికారులు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ఓ పచ్చనేత ఇంట్లో కూర్చొని చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. వారు లబ్ధిదారులను ఇంట్లోకి పిలిపించి ఫోటోలు తీసి ఈ తంతు నిర్వహించడం వాట్సప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ విషయంపై ప్రస్తావించిన సాక్షితో తహసీల్దార్ సీ షర్మిల మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేయాలన్నారు.

### 23న రాజకీయ నాయకులతో సమావేశం

శింగనమల: శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 23న నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి శనివారం తెలిపారు. సమావేశానికి రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల పెంపుపై చర్చిస్తామన్నారు.

### ఘనంగా అక్కినేని జయంతి

గుత్తి: పట్టణంలో శనివారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ , ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జూనియర్ ఏఎస్‌ఆర్ విజయ కుమార్, అక్కినేని అభిమాన సంఘం నాయకుడు దస్తగిరి తదితరులు అక్కినేని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

### రైతు ఉత్పత్తిదారుల సొసైటీ ఏర్పాటు

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లిలో పెడ్ రైతు ఉత్పత్తుదారుల సొసైటీని ఏర్పాటు చేయనున్నట్లు మార్కెట్ యార్డుమాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి అన్నారు. కంపెనీ సీఈఓ రామ్మోహన్ శనివారం రైతులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ మండలంలో ఎఫ్‌పీఓ అనే కంపెనీని ఏర్పాటు చేశామని, రైతులందరూ సభ్యత్వం తీసుకోవాలని అన్నారు. సభ్యత్వం తీసుకున్న రైతులకు తక్కువ ధరలకే వ్యవసాయ, వ్యవసాయేతర పనిముట్లు అందిస్తామన్నారు. అలాగే రైతులు పండించిన పంటలకు కంపెనీ నుంచి గిట్టుబాటు ధర కల్పించి, దళారీ వ్యవస్థ లేకుండా చేస్తామన్నారు. ఎల్‌ఆర్పీ మౌలాలీ, అకౌంటెంట్ అరుణ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

### భూమి వివాదంలో ఇద్దరికి గాయాలు

శింగనమల: మండలంలోని పెరవళి గ్రామంలో భూమి విషయంలో రామకృష్ణ , నరేంద్రపై ఆదే గ్రామానికి చెందిన దామోదర్ , చిందానంద , రాము దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో రామకృష్ణ , నరేంద్రకు గాయాలవడంతో శనివారం ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### డాక్యుమెంట్ రైటర్ల ‘పెన్‌డౌన్’

గుత్తి: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త విధానాల వల్ల డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులకు గురి కావలసి వస్తోందని, నూతన విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండో రోజైన శనివారం కూడా గుత్తిలో డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ మంజుకు అందజేశారు.

### వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద వీఆర్‌ఏ ధర్నాకు దిగారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలకు చెందిన వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని తమ డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పే స్కేల్ అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 22 కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు వీఆర్‌ఏలు హాజరై విజయవంతం చేయాలలన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ శనివారం సాయంత్రం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బెటాలియన్‌లో జరుగుతున్న కార్యక్రమాల వివరాలను కలెక్టర్‌కు కమాండెంట్ వివరించారు.

### ‘లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు’

గుంతకల్లుటౌన్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అరుణ, డాక్టర్ హరిత తెలిపారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై శనివారం వైద్య,ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ పద్మలత, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కానిస్టేబుళ్లకు అభినందన



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం శ్రీసాయి మహిళా డిగ్రీ కాలేజీలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కమలమ్మ, రిటైర్డ్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.నాయుడు, శ్రీసాయి కాలేజీ కరస్పాండెంట్ ప్రభాకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర, ఐద్వా కార్యదర్శి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పది మందిపై కేసు

యాడికి: మండలంలోని నగరూరు గ్రామంలో శనివారం దాసరి ఏసయ్య కుమారుడు సింహాద్రిపై అదే గ్రామానికి చెందిన రాజుతో పాటు మరో తొమ్మిది మంది పాత కక్షలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.